క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బిల్వార్చన



నవాబుపేట: మండలంలోని లోకిరేవు వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి లింగయ్యస్వామి ఆధ్వర్యంలో భద్రకాళి సహిత వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూప తెలిపారు. ఎంపీపీ కళావతి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉపాధి హామీ కూలీలకు డబ్బు చెల్లించాలి

చిన్నచింతకుంట: ఉపాధి హామీ పథకం కూలీలకు వెంటనే కూలి డబ్బులు చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబి రాజు డిమాండ్ చేశాడు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులను దారి మళ్లించి కూలీల పొట్ట కొట్టడం సరికాదన్నారు. పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆయుర్వేదంపై అపోహలు వద్దు



అడ్డాకుల: ఆయుర్వేద వైద్యంపై అపోహలు అవసరంలేదని మండల ఆయుర్వేద డాక్టర్ లావణ్య అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లితండాలో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం అవుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయభేరి సభను జయప్రదం చేయండి

నవాబుపేట: ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానకార్యదర్శి బంగ్లరవి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయభేరి సభకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రమేష్‌గౌడ్, జంగయ్య, మల్లేష్, రాజు నర్సింహులు, అశోక్‌కుమార్, శేఖర్, చెన్నయ్య ఉన్నారు.

ఓబీసీసెల్ మండల అధ్యక్షుల ఎన్నిక

భూత్పూర్/నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులను మంగళవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకుడు గోవర్ధన్‌గౌడ్ తెలిపారు. భూత్పూర్ మండల అధ్యక్షుడిగా జె.శ్రీనివాసులు, అడ్డాకుల అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, సీసీకుంట అధ్యక్షుడిగా వి.కమలాకర్, దేవరకద్ర అధ్యక్షుడిగా వి.గోపాల్, కౌకుంట్ల అధ్యక్షుడిగా పి.అంజనేయులు, మూసాపేట అధ్యక్షుడిగా నాగేష్, నవాబుపేట మండ అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి బాలోత్సవ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో గురువారం నుంచి బాలోత్సవ్ నిర్వహించనున్నట్లు కార్యక్రమ అధ్యక్ష, కార్యదర్శులు బెక్కం జనార్దన్, డాక్టర్ ప్రతిభ తెలిపారు. బుధవారం బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిన్నారుల మానసికోల్లాసం, సర్వతోముఖాభివృద్ధికి బాలోత్సవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 41 విభాగాల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వీరాంజనేయులు, ప్రమోద్, వీణ శివకుమార్ ఉన్నారు.

దుకాణాల తనిఖీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీ నుంచి శ్రీనివాసకాలనీ చౌరస్తా వరకు ఉన్న దుకాణాలను బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు చెత్తను రోడ్లపై వేయొద్దని సూచించారు. ఓ హార్డ్‌వేర్ షాపు యజమాని రోడ్డుపై చెత్త వేయగా, రూ.500 జరిమానా విధించారు.

గుండ్లపొట్లపల్లికి అవార్డుల పంట

- జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు
- సర్పంచ్ కృషితో అభివృద్ధి దిశగా అడుగులు



జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి (ఫైల్)

రాజాపూర్: మండలంలోని గుండ్లపొట్లపల్లి గ్రామ పంచాయతీకి అవార్డుల పంట పండుతోంది. సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి కృషితో అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తోంది. జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రత్యేక కుండీలను ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు సెగ్రిగేషన్ షెడ్‌లో ఎరువును తయారు చేసి, హరితహారం మొక్కలకు వినియోగిస్తున్నారు. ఇందుకుగానూ 2019లో గుండ్లపొట్లపల్లి పంచాయతీకి జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. అదే విధంగా ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ఇందుకోసం నానోవెన్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. 2019లో స్వచ్ఛ భారత్ అభియాన్ జాతీయ అవార్డు, స్వచ్ఛ భారత్ దివస్ అవార్డు దక్కింది. ఇంటింటా ఇన్నోవేటర్ రాష్ట్రస్థాయి అవార్డు సైతం గుండ్లపొట్లపల్లికే లభించింది. 2022లో దీన్ దయాల్ ఉపాధ్యాయ స్వశక్తికరణ్ అవార్డులను పొందింది. అంతేకాకుండా పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్ విభాగాల్లో 6 జిల్లాస్థాయి, 5 మండలస్థాయి అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 సంవత్సరానికిగానూ జిల్లాస్థాయి అవార్డుకు గుండ్లపొట్లపల్లి ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డిని కలెక్టర్ రవినాయక్ శాలువాతో సన్మానించి అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు.

అవార్డులతో మరింత బాధ్యత..

గ్రామానికి జాతీయ స్థాయి అవార్డులు రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగింది. ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉంది. వాటిని త్వరలోనే పూర్తి చేస్తాను. గ్రామంలో కొందరికి ఇల్లు లేవు. ఎమ్మెల్యే సహకారంతో అర్హులైన వారిని గృహ లక్ష్మి పథకానికి ఎంపిక చేసేందుకు కృషి చేస్తున్నా.

– రాఘవేందర్‌రెడ్డి, సర్పంచ్, గుండ్లపొట్లపల్లి

14 అసెంబ్లీ స్థానాల్లో గెలుపు మాదే..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపాఫీస్‌లో బుధవారం పార్టీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎన్నికల ముందు వచ్చే టూరిస్టులు కేవలం 3 నెలల వరకు మాత్రమే కనిపిస్తారని, ఆ తర్వాత భూతద్దం పెట్టి వెతికినా కనిపించరన్నారు. పదేళ్లుగా ప్రజల మధ్య ఎవరున్నారో గమనించాలని కోరారు. ఇప్పటికే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాకు అన్నం పెట్టే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, గౌరెలకాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శాంతయ్య, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ గణేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

కలశాలలో కృష్ణాజలాలు తెద్దాం

ఈనెల 16న సీఎం కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన తర్వాత కలశాలతో కృష్ణాజలాలు తీసుకొచ్చి అన్ని చెరువులు, ఆలయాల్లో చల్లాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో ప్రతి గ్రామం, పట్టణం నుంచి మహిళలు, రైతులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరు కావాలని, కలశాలలో కృష్ణాజలాలను తీసుకొచ్చి ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా గ్రామ చెరువుల్లో చల్లాలన్నారు. సమావేశంలో కలెక్టర్ జి.రవినాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ డీఆర్డీఓ యాదయ్య, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ఎంపీపీలు సుధాశ్రీ, బాలరాజ్, జెడ్పీటీసీలు వెంకటేశ్వరమ్మ, విజయనిర్మల ఉన్నారు.

'పాలమూరు'తో సస్యశ్యామలం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- పని చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో జిల్లా సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు, వలసల జిల్లాగా పేరొందిన పాలమూరును సస్యశ్యామలంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ఈనెల 16న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. పనులు పూర్తి కాకుండానే ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారంటూ విపక్ష నేతలు ఆరోపించడం తగదన్నారు. పనులు పూర్తయిన రిజర్వాయర్లకు దశల వారీగా నీటిని తరలిస్తామన్నారు. కేవలం 8 టీఎంసీల సామర్థ్యం కలిగిన జూరాల ప్రాజెక్ట్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం 30ఏళ్లపాటు కొనసాగించిందని, పాలమూరు ఎత్తిపోతలను తమ ప్రభుత్వం స్వల్పకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఫలితంగా జిల్లాలో పంటలు పుష్కలంగా పండుతున్నాయన్నారు. మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా పోలేపల్లి సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుతో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు చెప్పారు. గత తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధిని గమనించాలని, పనిచేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

రాజాపూర్ మండలం సేవ్యాతండా, జడ్చర్ల పాతబజార్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జడ్చర్ల మేస్త్రీల సంఘం అధ్యక్షుడు అంజనేయులు తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



అడ్డాకుల: మండలంలోని పెద్దమునగల్‌చేడ్, కన్మనూర్ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు బుధవారం వనపర్తిలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడొద్దని సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఐ సాహత్ ఇషాన్, ఎంపీటీసీలు చంద్రయ్య, గణేష్, ఎక్సైజ్ రిటైర్డ్ సీఐ దామోదర్‌రెడ్డి, భీంరెడ్డి, రాఘవేందర్, నర్సింహ, కమలాకర్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



జడ్చర్ల టౌన్: మహిళలను గౌరవించడం మన సంస్కృతి అని ఎస్‌ఐ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో షీటీం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సామాజిక బాధ్యత ఎంతో అవసరమని, చిన్ననాటి నుంచే మంచి లక్షణాలు అలవర్చుకుంటే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. దేశ రక్షణతోపాటు స్త్రీలపై గౌరవభావంతో ఉంటూ రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యురాలు శకుంతల, రఘు, ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి, డైరెక్టర్ ఖాషిష్, అక్షర భగత్‌జీ, సీసీపీసీ ఇన్‌చార్జ్ సాకేత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం ఏడు పాఠశాలల నుంచి 28మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వివేకానంద తెలిపారు. మిడ్జిల్ కేజీబీవీ విద్యార్థినులు ప్రథమ, బాలానగర్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ద్వితీయ, చిన్నరేవల్లి ఎంపీహెచ్‌ఎస్ తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



దేవరకద్ర రూరల్: మండలంలోని అడవి అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్‌బాబు ఇటీవల జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు మోహన్‌బాబును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హరీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనయ్య, శ్రీనివాసులు, భీంసేన్, విజయలక్ష్మి, రేణుక, గౌరీశంకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆల

భూత్పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నాసాగర్‌లో బుధవారం కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, బీజేపీలకు చెందిన 100మంది యువకులు ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో చింటు, వెంకటేష్, భానుప్రకాష్, శ్రీశైలం, వంశీ, మహేష్, భాస్కర్, పాషా, బురాన్, సిరాజ్, అల్తాఫ్, ముస్తాక్ తదితరులు ఉన్నారు. కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, ముడా డైరెక్టర్ సాయిలు, బాలస్వామి, కోఆప్షన్ సభ్యుడు అజీజ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అడ్డాకుల: మూసాపేటకు చెందిన తిరుమలసాగర్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆల అందజేశారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, మదీనా జమీర్, లక్ష్మీనర్సింహ, కొండయ్య, రవివర్ధన్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సందర్శనలో డిగ్రీ విద్యార్థులు



నల్లమలలో గడ్డి మైదానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీజెడ్సీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాఠ్య ప్రణాళికలో భాగంగా బుధవారం అమ్రాబాద్ టైగర్ రిజర్వు అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఉమామహేశ్వరంలో బ్రయోఫైట, టెరిడోఫైట మొక్కలను పరిశీలించారు. నల్లమల అడవుల్లో పెద్దపులుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి మైదానాలను సందర్శించారు. మైదానాల ఆవశ్యకతను అటవీశాఖ అధికారి రవికాంత్ విద్యార్థులకు వివరించారు. అనంతరం డిండి ప్రాజెక్టును సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, సదాశివయ్య పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేష్

జడ్చర్ల: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ రమేష్‌బాబు కోరారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలతో ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు సమాచారాన్ని పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

దేవరకద్ర రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పండుగల నేపథ్యంలో బలవంతంగా చందాలను వసూలు చేయొద్దన్నారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే వారు అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాములు

కోయిల్‌కొండ: గ్రామాల్లో అభివృద్ధి పనుల పూర్తిపై నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా వందశాతం ఇంటిపన్ను వసూలు చేయడంతోపాటు హరితహారంలో నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ నజీర్ హైమద్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై జాప్యం సరికాదు'



దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

జడ్చర్ల టౌన్: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్‌మాదిగ అన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రాజు, వినోద్, శివ, కేశవులు, శంకర్, బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



జడ్చర్లలో మాట్లాడుతున్న మధుసూదన్‌యాదవ్

జడ్చర్ల టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుసూదన్‌యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లను బెదిరింపులకు గురిచేయడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, కౌన్సిలర్ కుమ్మరి రాజు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అనంత కిషన్, అంజనేయులు, సాహితీరెడ్డి, బుక్క నవీన్, దీప్లానాయక్, తెలుగు సత్తయ్య, కృష్ణయ్య, ఆసియాబేగం, ప్రభావతి, సరోజ, రాజ్యలక్ష్మి, మహేశ్వరి, కవిత, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంబించడం సరికాదని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గద్దం ఎల్లప్ప అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు.

స్ఫూర్తిదాయకం.. తెలంగాణ సాయుధ పోరాటం



మునిమోక్షంలో మాట్లాడుతున్న గోపాల్

హన్వాడ: తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర నాయకుడు కే.గోపాల్ అన్నారు. మండలంలోని మునిమోక్షంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, దొరల గడీల పాలనకు వ్యతిరేకంగా జరిగిన మహోత్తర పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమని అన్నారు. ఈ పోరాటానికి బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎర్రజెండా నాయకత్వంలోనే కొనసాగిందన్నారు. దున్నే వాడికే భూమి నినాదంతో 10లక్షల ఎకరాలను పంచిందని గుర్తు చేశారు. కొందరు రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పూస్తున్నారని, కులమత చిచ్చుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ పోరాటంలో హిందూ ముస్లింలు ఎంతోమంది అమరులయ్యారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 17 వరకు అన్ని గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య, బాలయ్య, శ్రీకాంత్, వెంకటయ్య, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: చైత్ర సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూజన వేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుడి ప్రతిమతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, వెంకటేష్, నాగ్యానాయక్, కోటీశ్వరమ్మ, మంగమ్మ, ఉమామహేశ్వరి, జ్యోత్స్న, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని గాజులపేట స్టేజీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అడ్డాకుల నుంచి భూత్పూర్‌వైపు వస్తున్న డీసీఎం ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి, డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మహ్మద్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు ఎల్‌అండ్‌టీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతికష్టంతో బయటికి తీశారు. అతడికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి నటరాజ్

దేవరకద్ర రూరల్: ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నటరాజ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ సెక్టార్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలకపాత్ర అని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులను పరిశీలించాలని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ అధికారులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com